

నేడు ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ఈనెల 3వ తేదీన సోమవారం చిత్తూరు కలెక్టరేట్‌లో ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంను ఉదయం 9.30 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కలెక్టరేట్‌లోని సమావేశపు మందిరంలో నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులు ఉదయం 9 గంటకల్లా తప్పక హాజరు కావాలని కలెక్టర్ ఆదేశించారు. అలాగే నియోజక వర్గ, మండల స్థాయిలో జరిగే ప్రజాసమస్యల పరిష్కారవేదికలో నియోజకవర్గ, మండలస్థాయి అధికారులందరూ విధిగా హాజరుకావాలని ఆదేశించారు.

నీటి సమస్య పరిష్కారానికి

ప్రత్యేక సెల్ ఏర్పాటు

కమిషనర్ నరసింహ ప్రసాద్



ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: వేసవి నేపథ్యంలో నగరపాలక పరిధిలో నీటి సమస్య పరిష్కారం కోసం నగరపాలక కార్యాలయంలో ప్రత్యేక సెల్ ఏర్పాటు చేసినట్లు కమిషనర్ పి.నరసింహ ప్రసాద్ చెప్పారు. నగరపాలక పరిధిలోని వార్డుల్లో ఎక్కడైనా నీటి సమస్య ఉంటే నగరపాలక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సెల్ నెంబర్ 9849907885కు ఫోన్ కాల్ లేదా వాట్సాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని కమిషనర్ తెలిపారు. వేసవిలో నగరంలో నీటిసమస్య తలెత్తకుండా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈ అవకాశాన్ని నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కార్పొరేషన్ రాయితీ రుణాలకు ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరపాలక సంస్థ పరిధిలో బీసీ, కాపు, ఈబీసీ కార్పొరేషన్ల రాయితీ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి మంగళవారం 4న 1 నుంచి 25 వార్డుల వారికి, బుధవారం 5న 26 నుంచి 51 వార్డుల పరిధిలోని దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు నగర కమిషనర్ పి.నరసింహ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. చిత్తూరు నగరపాలక కార్యాలయంలో జరిగే ఈ ఇంటర్వ్యూలకు రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న దరఖాస్తుదారులు తమ దరఖాస్తుతో పాటు జతచేసిన ధృవీకరణ పత్రాల ఒరిజినల్ సర్టిఫికెట్లను తప్పనిసరిగా తీసుకురావాలన్నారు. ఇంటర్వ్యూలు ఉదయం 9 నుంచి 5 గంటల మధ్య జరుగుతుందన్నారు.

పశు గణాభివృద్ధికి సహకారం

'లింగ నిర్ధారణ కేంద్రం'



ఉచిత లింగ నిర్ధారిత కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ శ్రీకాంత్

ప్రజాశక్తి- కుప్పం టౌన్: కుప్పం పట్టణంలోని పశు ఆరోగ్య కేంద్రంలో ఆదివారం రాష్ట్ర పశు సంవర్తక శాఖ, పశుగణాభివృద్ధి సంస్థ, రాష్ట్రీయ గోకుల్ మిషన్ రాయలసీమ ప్రాజెక్టు, నేషనల్ డైరీ డెవలప్మెంట్ బోర్డ్ ఆధ్వర్యంలో ఉచిత లింగ నిర్ధారిత వీర్యం కృత్రిమ గర్భధారణ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, ఏపీఎస్ ఆర్టీసీ ఉపాధ్యక్షులు పిఎస్.మునిరత్నం ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పశుగణాభివృద్ధికి ఎంతగానో కృషి చేస్తున్నారని, పాడి పరిశ్రమ అభివృద్ధి వల్ల ఎంతోమంది పేదలకు ప్రయోజనం చేకూరుతుందని అన్నారు. మహిళలు సైతం పాడి పశువులను పెంచుకొని, ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారని తెలిపారు. పాడి రైతులకు మరింత సహకారాలు అందిస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి తన సొంత నియోజకవర్గ కేంద్రమైన కుప్పం పట్టణంలో ఉచిత లింగ నిర్ధారిత వీర్యం కృత్రిమ గర్భధారణ కేంద్రాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని స్థానిక పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

బడ్జెట్లో బీసీలకు ప్రాధాన్యత

బీసీ సంక్షేమ సంఘం దక్షిణాది రాష్ట్రాల కార్యదర్శి షణ్ముగం

ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్: రాష్ట్రంలో మొదటిసారి రూ.3,22,359 కోట్లతో కూడిన భారీ బడ్జెట్ అభివృద్ధికి సంక్షేమానికి ప్రాధాన్యమిస్తూ రూపొందించిన బడ్జెట్ అని బీసీ సంక్షేమ సంఘం దక్షిణాది రాష్ట్రాల ప్రధాన కార్యదర్శి షణ్ముగం తెలిపారు. ఆదివారం స్థానిక బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీలకు చరిత్రలో ఎన్నడు లేని విధంగా కేటాయింపులు చేశారని, ఉమ్మడి ఏపీలోనూ ఇంత పెద్ద మొత్తంలో బీసీ వర్గాలకు బడ్జెట్ కేటాయింపులు ఎప్పుడు చేయలేదని తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవులకు బీసీ సంక్షేమ సంఘం తరపున కృతజ్ఞతలు తెలియజేశారు. సంక్షేమ సంఘం మహిళా ప్రధాన కార్యదర్శి హేమావతి, జిల్లా వడ్డెర సంక్షేమ సంఘం అధ్యక్షులు కే.రవీంద్ర రాజు, హరిబాబు, ప్రతాప్, లావణ్య, రుద్రయ్య పాల్గొన్నారు.

విచ్చలవిడిగా బెల్ట్ షాప్‌లు

- 24 గంటలూ అందుబాటులో మందు
- మామూళ్ల మత్తులో ఎక్సైజ్ శాఖ
- రోడ్లపై మందుబాబుల హల్‌చల్
- చర్యలు తీసుకోవాలని కోరుతున్న స్థానికులు



ప్రజాశక్తి - పుత్తూరు, టౌన్ : పుత్తూరు మున్సిపల్ పరిధిలో ఎక్కడపడితే అక్కడ విచ్చలవిడిగా బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నారు. పుత్తూరు నారాయణవనం, వడమాలపేట మండలాల్లో బెల్ట్ షాప్ నిర్వహుకులకు ప్రభుత్వ నిబంధనలు, ఆదేశాలు వర్తించవు. ఎక్సైజ్ శాఖ అధికారులు చూసీ చూడనట్టు వ్యవహరించడంతో వారు బెల్టు షాపు వ్యాపారం జోరుగా సాగిస్తున్నారు. ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకు మద్యం విక్రయాలు జరపాలనే నిబంధనలున్నా, బెల్టు షాపుల పుణ్యమాని మందు బాబులకు 24 గంటలు మద్యం అందుబాటులో ఉంచుతున్నారు. అధికారులు, నాయకుల అండదండలతో ఈ బెల్డు షాపుల వ్యాపారం మూడు పువ్వులు, ఆరు కాయలుగా సాగుతోందని స్థానికులు తెలుపుతున్నారు. ఎల్లప్పుడూ మందు అందుబాటులో ఉండటంతో మద్యానికి బానిసైనవారు ఇల్లు గుల్ల చేసుకుంటున్నారు. రోడ్లపై తప్పతాగి ప్రజలకు ఇబ్బంది కలిగిస్తున్నారు. మహిళలు, చిన్నారులు మందు బాబుల దెబ్బకు బెంబేలెత్తుతున్నారు. బెల్టు షాపులు అరికడితే కనీసం కొందరైనా మారతారని మందుబాబుల కుటుంబ సభ్యులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి బెల్టు షాపు నిర్వహుకులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు, ప్రజాసంఘాలు కోరుతున్నారు. చర్యలు తీసుకోని పక్షంలో సంబంధించిన శాఖ కార్యాలయం ముందు ధర్నా చేస్తామని ప్రజాసంఘాల నాయకులు హెచ్చరిస్తున్నారు.

కోళ్ల పరిశ్రమకు అనుకూలం కుప్పం ప్రాంతం



అవగాహన సదస్సులో ప్రసంగిస్తున్న ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్

ప్రజాశక్తి- కుప్పం టౌన్: కోళ్ల పరిశ్రమ నిర్వహణకు కుప్పం ప్రాంత వాతావరణం ఎంతో అనుకూలంగా ఉంటుందని కోళ్ల పరిశ్రమశాఖ అధికారులు తెలిపారు. కుప్పం పట్టణంలోని టిడిపి కార్యాలయ ఆవరణలో ఆదివారం వారు కోళ్ల పరిశ్రమపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, ఏపీఎస ఆర్టీసీ ఉపాధ్యక్షులు పిఎస్.మునిరత్నం, టిడిపి రాష్ట్ర నిర్వాహక కార్యదర్శి డాక్టర్ సురేష్ బాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా ప్రచారం జరుగుతున్న బర్డ్‌ఫ్లూ అపోహ మాత్రమే అన్నారు. కోడి మాంసం ఉడికించే వేడికి అందులోని వైరస్‌లు అంతరించిపోతుందని తెలిపారు. ముఖ్యంగా కోడి మాంసం, కోడిగుడ్లలో అధిక ప్రోటీన్లు ఉండి, మానవ ఆరోగ్యానికి దోహదపడుతుందని తెలిపారు. అలాగే కోళ్ల పెంపకం ద్వారా జీవనోపాధి సైతం కలుగుతుందని, ప్రధానంగా ద్రావిడ కూడలిలోని కుప్పం, పలమనేరు, కర్ణాటక రాష్ట్రానికి చెందిన కోలారు ప్రాంతాలు కోళ్ల పరిశ్రమల నిర్వహణకు అనుకూలంగా ఉన్నట్టు తెలిపారు. ఈ అవకాశాన్ని స్థానిక రైతులు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు సద్వినియోగం చేసుకొని, కోళ్ల పరిశ్రమ నిర్వహణకు ముందుకు రావాలని సూచించారు. అనంతరం ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ మాట్లాడుతూ కుప్పం ప్రాంతంలో ప్రత్యేకంగా కోళ్ల పరిశ్రమ నిర్వహణకు ముందుకు వచ్చే పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం నుంచి సహకారం అందేలా ప్రయత్నం చేస్తామని తెలిపారు. ఈ విషయాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి కోళ్ల పరిశ్రమ నిర్వహణకు రాయితీ ఇచ్చేందుకు తమ వంతు ప్రయత్నం చేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ డాక్టర్ వెంకటేష్, కాణిపాకం వెంకటేష్, కోళ్ల పరిశ్రమ శాఖ అధికారులు, యజమానులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

ఆధునిక టెక్నాలజీని సద్వినియోగం చేసుకోవాలి



ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ద్విచక్ర వాహన మెకానిక్‌లు ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఆధునిక టెక్నాలజీని సద్వినియోగం చేసుకోవాలని ప్రముఖ ద్విచక్ర వాహన మరమ్మతుల నిపుణులు సూచించారు. ఆదివారం స్థానిక అంబేద్కర్ భవన్ సమావేశ మందిరంలో చిత్తూరు నగర ద్విచక్ర వాహన మెకానిక్స్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ద్విచక్ర వాహన మెకానిక్‌లకు, పారిశ్రామిక శిక్షణ సంస్థల్లో శిక్షణ పొందిన మోటార్ మెకానిక్ కోర్సు విద్యార్థులకు కొత్తగా వస్తున్న బీఎస్ - 6 ద్విచక్ర వాహనాల మరమ్మతులపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ క్రమంలో బిఎస్ 6 వాహన మరమ్మతుల నిపుణులు సమ్మర్ ద్విచక్ర వాహనాలను రిపేర్ చేసే విధానాన్ని ప్రత్యక్షంగాను చేస్తూ, ఎల్సీడీ ప్రొజెక్టర్ ద్వారాను ప్రయోగాత్మకంగా వివరించారు. చిత్తూరు నగర ద్విచక్ర వాహన మెకానిక్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.మురుగేషన్, బాలచంద్ర మాట్లాడుతూ ప్రస్తుతం మార్కెట్లో ప్రవేశిస్తున్న బిఎస్ - 6 వాహనాల మరమ్మతులపై ప్రత్యేక నిపుణుల చేత ఒక రోజు అవగాహన కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. సంబంధిత అవగాహన సదస్సు తమ లాంటి మెకానిక్ లకు ఎంతగానో ఉపయోగపడుతోందన్నారు. రానున్న రోజుల్లో ఇలాంటి కార్యక్రమాలను మరిన్ని చేపట్టి మెకానిక్‌లలో మరింత నైపుణ్యాన్ని పెంపొందించేందుకు కృషి చేస్తామన్నారు. అనంతరం అవగాహన సదస్సులో పాల్గొన్న ఐటిఐ విద్యార్థులకు, ద్విచక్ర వాహన మెకానిక్స్‌కు సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. ద్విచక్ర వాహన మరమ్మతుల నిపుణులు బెంగళూరుకు చెందిన భాస్కర్ నాయుడు, వైజాగ్ చెందిన పవన్, కాకినాడకు చెందిన రాము, చిత్తూరు నగర ద్విచక్ర వాహన మెకానిక్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు ఇస్మాయిల్, కోశాధికారి షణ్ముగరెడ్డి, జాయింట్ సెక్రటరీ మస్తాన్, గౌరవాధ్యక్షులు కుమరేషన్ మురగ పాల్గొన్నారు.

వేడుకగా కైలాస గిరి ప్రదక్షిణ



ప్రజాశక్తి- శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం (10వ రోజు) శివపార్వతుల గిరిప్రదక్షిణ వేడుకగా జరిగింది. గంగాభవానీ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామి, జ్ఞానప్రసూనాంబ ఉత్సవమూర్తులను అలంకార మండపంలో విశేషంగా అలంకరింపజేశారు. అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను గిరిప్రదక్షిణకు తీసుకెళ్లారు. స్థానిక ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి సతీమణి బొజ్జల రిషితారెడ్డి గిరి ప్రదక్షిణను ప్రారంభించారు. రాజగోపురం నుండి చతుర్మాడవీధుల్లోకి శివపార్వతులు ఊరేగింపుగా ప్రవేశించారు. భేరివారి మండపం వద్ద భేరి కులస్థులు ఇచ్చిన నాగవల్లిని అమ్మవారికి ధరింపచేశారు. అనంతరం జయరామరావువీధి, ఎన్టీఆర్ నగర్, తెలుగుగంగ కాలనీ, కైలాసగిరి కాలనీ, రాజీవ్ నగర్ మీదుగా గిరి ప్రదక్షిణ జరిగింది. రామాపురం రిజర్వాయరు సమీపంలో గల అంజూరు మండపం వద్ద స్వామి, అమ్మవార్లు కొంతసేపు విశ్రమించారు. అనంతరం అంజూరు మండపం నుంచి వేదాం మీదుగా శుకబ్రహ్మాశ్రమం సమీపంలోని ఎదురు సేవా మండపానికి స్వామి, అమ్మవార్లు సాయంత్రానికి చేరుకున్నారు. అనంతరం శివపార్వతుల ఉత్సవ మూర్తులను ముక్కంటి ఆలయానికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదనరెడ్డి ఉభయదారుగా వ్యవహరించారు. ముక్కంటి ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షులు అంజూరు తారక శ్రీనివాసులు, ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్వీ నాగేశ్వరరావు, ధర్మకర్తల మండలి సభ్యులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రేపు ధ్వజావరోహణం

శ్రీకాళహస్తీశ్వర ఆలయంలో మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని సోమవారం ధ్వజావరోహణ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంతో మహా శివరాత్రి ఉత్సవాలు దాదాపు ముగిసినట్లే. ధ్వజావరోహణం చేసే రాత్రిని దేవరాత్రిగా పిలుస్తారు. క్షీరసాగర మథనంలో అమృతం జనించాక దేవతలు శివ సాన్నిధ్యంలో ధ్వజావరోహణం చేసి, తమ నిజస్థానాలకు వెళతారు. ఇందులో భాగంగా ఉదయం శివ పార్వతుల ఉత్సవ మూర్తులను పురవీధుల్లో చప్పరాలపై ఊరేగించనున్నారు. ఇక రాత్రి స్వామి వారిని సింహాసనం పైనా, అమ్మవారిని కామధేనువు పైన పురవీధుల్లో ఊరేగిస్తారు. ఈ వేడుకల్లో భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

ఘనంగా హల్లో కిడ్స్ వార్షికోత్సవ సంబరాలు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: నగరంలోని నాగయ్య కళాక్షేత్రంలో హల్లో కిడ్స్ చిత్తూరు బ్రాంచ్ నాల్గవ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా చుడ చైర్‌పర్సన్ కటారి హేమలత, విశిష్ట అతిథులుగా హైకోర్టు న్యాయవాది త్రిమూర్తి, యాక్సిస్ బ్యాంక్ చిత్తూరు బ్రాంచ్ సీనియర్ మేనేజర్ శేఖర్ గుప్త హాజరయ్యారు. హల్లో కిడ్స్ యాజమాన్యం వీరిని సాదరంగా ఆహ్వానించి వారిచేత జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. మాంటిసోరి విద్యావిధానంలో విద్యను బోధిస్తూ వాస్తవాలకు దగ్గరగా ఫీల్డ్ ట్రిప్స్, ఔట్ డోర్ లెర్నింగ్ విధానానికి ప్రాముఖ్యతనిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఇన్నోవేషన్ ఇన్‌ఎర్లీ చైల్డ్ హుడ్ ఎడ్యుకేషన్ అవార్డులు అందజేశారు. చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

తుడ టవర్స్ రెసిడెన్షియల్ ఫ్లాట్స్ ఈ-వేలం



నగర పాలక సంస్థ కమిషనర్ మౌర్య

ప్రజాశక్తి - తిరుపతి టౌన్ : ఈ నెల 8 నుండి 12 వరకు తుడా టవర్స్‌లోని రెసిడెన్షియల్ ఫ్లాట్స్ ఆన్ లైన్‌లో ఈ - వేలం ప్రక్రియ నిర్వహించ బడుతుందని తుడ వైస్ చైర్మన్ ఎన్.మౌర్య ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి అన్నమయ్య సర్కిల్, ఎయిర్ బైపాస్ రోడ్డు సమీపంలో తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ 13 అంతస్తులతో 'తుడా టవర్స్' నిర్మాణాన్ని 3.60 ఎకరాల్లో, 8,28,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో రూ.345 కోట్ల అంచనా వ్యయంతో 2023 సంవత్సరంలో అన్ని ప్రభుత్వ అనుమతులతో నిర్మాణం చేపట్టడం జరిగినదని తెలిపారు. ఇప్పటి వరకు 6 అంతస్తులలో నిర్మాణ పనులు పూర్తయి 7వ అంతస్తు నిర్మాణం పురోగతిలో ఉన్నదన్నారు. 2026 ఏప్రిల్ లోపు నార్మాణాలు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ నిర్మాణంలో రెసిడెన్షియల్ ఫ్లాట్స్, వాణిజ్య, కార్యాలయాల అవసరాలకు కూడా నిర్మాణాలు చేపట్టడం జరుగుతోందని తెలిపారు. ఇందులో బేస్మెంట్ పార్కింగ్ సదుపాయం కొరకు, గ్రౌండ్, మొదటి అంతస్తులో దాదాపు 1,20,000 చదరపు అడుగుల విస్తీర్ణములో వాణిజ్య సదుపాయం కొరకు, రెండవ అంతస్తు నుండి 5వ అంతస్తులో దాదాపు 90,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో వివిధ కార్యాలయాల సదుపాయాల కొరకు కేటాయించడం జరిగిందని తెలిపారు. అలాగే నివాస గృహాలకు సంబంధించి 2వ అంతస్తు నుండి 13 వ అంతస్తు వరకు 1235 చదరపు అడుగుల డబుల్ బెడ్ రూమ్స్ ఫ్లాట్స్ - 46, అలాగే 1900 చదరపు అడుగుల ట్రిబుల్ బెడ్రూమ్స్ ఫ్లాట్స్ - 152, 3740 చదరపు అడుగుల నాలుగు బెడ్ రూమ్స్ ఫ్లాట్స్ -32, మొత్తం 230 నివాస భవనాల నిర్మాణాలు జరుతున్నాయని తెలిపారు. నివాసితులకు స్విమ్మింగ్ పూల్, జిమ్, షటిల్ కోర్ట్, ల్యాండ్ స్కేపింగ్ పోడియం, చిల్డ్రన్స్ ప్లే ఏరియా, రెస్టారెంట్ మొదలగు ఆధునిక సౌకర్యములతో పాటు రెసిడెన్షియల్, వాణిజ్య భవనాలకు ప్రత్యేక ఎంట్రీ, ఎగ్జిట్ వసతిని కల్పించడం జరుగుతోందన్నారు. రైల్వే స్టేషన్, బస్టాండ్, నేషనల్ హైవే లకు చేరడానికి అత్యంత అనువుగా ఈ తుడా టవర్స్ ఉన్నాయని తెలిపారు. ఆసక్తి కలవారు ఈ - వేలంలో పాల్గొనవచ్చునని , మోడల్ ఫ్లాట్స్‌ను పరిశీలించవచ్చని తెలిపారు. వివరాలకోసం ఏపీ డాట్ ఇన్, తుడా టవర్స్ డాట్ ఇన్ వెబ్సైట్స్ పరిశీలించవచ్చని తెలిపారు. ప్రభుత్వ నిబంధనలు పాటిస్తూ, అన్ని నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణయించిన కాలవ్యవధిలో నిర్మాణాలు పూర్తి చేయటానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని తుడా విసి ఆ ప్రకటనలో తెలిపారు.

మహిళా సాధికారత వారోత్సవాలు ప్రారంభం



మహిళా ఉద్యోగులకు యోగా శిక్షణ ఇస్తున్న పోలీసులు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డిజిపి హరీష్ కుమార్ గుప్తా ఆదేశాల మేరకు చిత్తూరు జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు నేతృత్వంలో 2వ తేదీ ఆదివారం నుండి 8వ తేదీ వరకు మహిళల భద్రత, రక్షణకు సంబంధించిన పలు అంశాలపై 'మహిళా సాధికారత వారోత్సవాలు' నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆదివారం చిత్తూరు జిల్లాలోని పోలీస్ స్టేషన్ల పరిధిలో సంబంధిత పోలీసు అధికారుల సమక్షంలో ప్రతి పోలీస్ స్టేషన్‌లో మహిళా ఉద్యోగులకు యోగ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మహిళా ఉద్యోగులకు శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించుకోవడంలో యోగా ప్రాముఖ్యతను తెలియజేశారు. ఈనెల 8వ తేదీ వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తామని, ఈ తరహా కార్యక్రమాలు మహిళలకు శక్తిని, మానసిక స్థైర్యాన్ని, స్వీయరక్షణ సామర్థ్యాన్ని పెంపొందించడానికి దోహదపడతాయని జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు తెలిపారు.

టెం'ఢర్'



- నాయనా టెండర్లు తీసుకో..
- మాకు వద్దే వద్దు..
- పాత బిల్లులు ఇస్తే చాలు..
- కొత్త పనులు చేయలేం
- నగరపాలక సంస్థ పనులు చేసేందుకుముందుకు రాని కాంట్రాక్టర్లు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: బాబు టెండర్లు వేసుకో, నాయనా టెండర్లు తీసుకో అంటూ అధికారులు కాంట్రాక్టర్లను బతిమాలుతున్నారు. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో జనరల్ ఫండ్స్‌లో 30 పనులు గాను సుమారు రెండు కోట్లు విలువచేసే పనులకు టెండర్లను పిలవడం జరిగింది. ఇందులో రోడ్లు, కాలువలు, తాగునీటి పైప్ లైన్, ఇతర చిన్న పనులు చేయాల్సిఉండా. అయితే కాంట్రాక్టర్లు చాలామంది కొత్తగా పనులు చేసేందుకు ఆసక్తి చూపడంలేదు. 30 పనులు గాను కనీసం 10 మంది మాత్రమే అది కూడా బలవంతంగా తీసుకోవడం జరిగింది. ఎందుకంటే గత ప్రభుత్వ హయాంలో విచ్చలవిడిగా టెండర్లు పిలిస్తే పనులు చేశారు. ఇప్పటివరకు ఆ బిల్లులకు పూర్తిస్థాయిలో చెల్లింపులు జరుగలేదు. కొత్తగా మళ్ళీల పనులు చేస్తే బిల్లులు వస్తాయో రాదోనన్న అనుమానంతో పనులు చేయడానికి ఎవరూ ముందుకు రావడం లేదు. దీంతో మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు కాంట్రాక్టర్లను బతిమాలుతున్నారు. కొంతమంది కాంట్రాక్టర్లయితే మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం దరిదాపుకు కూడా రావడం లేదు. కొత్తగా పిలిచిన టెండర్ పనులు చేయకుంటే, గతంలో చేసిన పనులకు బిల్లులు ఆపుతామని ఎక్కడ తిరకాసు పెడతారోనన్న భయంతో కాంట్రాక్టర్లు కార్యాలయానికి రావడం మానేశారు. మరి కొంతమంది కాంట్రాక్టర్లు వడ్డీకి అప్పు తీసుకొచ్చి పనులు చేయలేమని, కార్పొరేషన్ తమకు అప్పుగా ఇస్తే పనులు చేస్తామని చెబుతున్నారు. ఈ సమస్య మున్సిపల్ ఇంజనీరింగ్ ఉన్నతాధికారులు కమిషనర్ మౌర్య దృష్టికి తీసుకువెళ్లారు. ఎలాగైనా కాంట్రాక్టర్ల చేత పనులు చేయించేలా బుజ్జగించాలని ఇంజనీరింగ్ అధికారులకు ఆమె సూచించారు. ఇది గ్రహించిన కొంతమంది కాంట్రాక్టర్లు తమ ఫోన్లు కూడా స్విచాఫ్ చేసినట్టు సమాచారం. మరికొంతమంది తాము అప్పులు పాలైపోయినమని తమ దగ్గర డబ్బులు లేవని అంటున్నారు. ఏది ఏమైనా కొత్త పనులు చేసేందుకు తిరుపతి కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు.

కొత్త వారి కోసం వెతుకులాట

నగర పాలక సంస్థ ఇంజనీరింగ్ అధికారులు కొత్తగా పిలిచిన 30 పనులు చేసేందుకు పాత కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో కొత్తగా కాంట్రాక్టర్‌గా రిజిస్ట్రేషన్ చేసుకున్న వ్యక్తుల్ని ఇంజనీరింగ్ అధికారులు అన్వేషిస్తున్నారు. ఈ పనులు చేస్తే బిల్లులు సకాలంలో ఇస్తామని ఆశలు చూపిస్తున్నారు. కొత్త కాంట్రాక్టర్లు పనులు చేస్తే వారికి అనుభవం రావడమే కాకుండా కాంట్రాక్టరుగా గుర్తింపు కూడా వస్తుందని వారిని నమ్మించే ప్రయత్నాలు చేస్తున్నారు. గత ప్రభుత్వంలో విచ్చలవిడిగా బడ్జెట్‌కు విరుద్ధంగా పనులు చేయడం వల్ల బిల్లులు పేరుకుపోయాయి.

పాత బిల్లుల బకాయిలు రూ. 70 కోట్లు

వైసిపి ప్రభుత్వం గత ఐదు సంవత్సరాల కాలంలో సుమారు నగరపాలక సంస్థ పరిధిలో 200 కోట్ల రూపాయల పనులు పిలిచారు. ప్రస్తుతం పాత కాంట్రాక్టర్లకు 70 కోట్ల రూపాయలు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ బిల్లుల కోసం కాంట్రాక్టర్లు అడగని అధికారులు, అడగని రాజకీయ నేతలు లేరు. ఒక్క ముఖ్యమంత్రి తప్ప మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీల ద్వారా కూడా కాంట్రాక్టర్లు బిల్లులకోసం కమిషనర్‌పై ఒత్తిడి చేయించారు. మున్సిపల్ కార్పొరేషన్ ఖజానా ఖాళీ కావడంతో కాంట్రాక్టర్లకు పూర్తిస్థాయిలో బిల్లులు ఇవ్వలేని పరిస్థితిలో ఉన్నారు. ఆస్తి పన్నులు ఇతర పన్నులు వసూలు చేసి కాంట్రాక్టర్లకు కొంత కొంత ఇవ్వడం జరుగుతోంది. ప్రస్తుతం నగరపాలక సంస్థ పరిధిలో ఆస్తిపన్ను వసూళ్లపై యంత్రాంగం దృష్టి పెంచింది. పన్నులు వసూలుచేసి కార్పొరేషన్ ఖజానాను కొంతవరకైనా నింపేందుకు తిరుపతి నగర పాల సంస్థ కమిషనర్ మౌర్య ప్రయత్నాలు చేస్తున్నారు.


జాన్సిన్‌ను సన్మానిస్తున్న ముస్లిం ఐక్యవేదిక సభ్యులు

విద్యార్థినికి సత్కారం

ప్రజాశక్తి -బంగారుపాళెం: బాస్కెట్ బాల్ విద్యార్థినికి ముస్లిం ఐక్యవేదిక సభ్యులు మండల కేంద్రంలో సత్కరించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ డిఇవో అజంతుల్లా మాట్లాడుతూ క్రీడాకారిణి జాన్సిన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యను అభ్యసిస్తూ బాస్కెట్ బాల్ క్రీడలపై ఆసక్తి చూపి తన ప్రతిభను ప్రదర్శించి జాతీయ పోటీలకు ఎంపిక కావడంతో ముస్లిం ఐక్యవేదిక ఆధ్వర్యంలో రూ.10 వేలు నగదు అందించి దుశ్శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ముస్లిం ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు ఫిరోజ్ అహ్మద్, జిల్లా ఉపాధ్యక్షులు జైనుల్, రాష్ట్ర అధికార ప్రతినిధి సౌకత్, సమన్వయకర్త రషీద్, నియోజకవర్గ అధ్యక్షులు ఖాజా, గౌరవ అధ్యక్షులు రహీం పాల్గొన్నారు.

భక్తులకు అన్నదానం

ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు: మండలంలోని మిట్ట వేల్పూరులో కాళికాదేవి ఆలయ మహాకుంభాభిషేకం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం నిర్వహించారు. కుంభాభిషేకరంలో భాగంగా గోపూజ, ప్రాణ ప్రతిష్ట హోమం, నేత్ర దర్శనం, నాడీ సంధానం, బీజాక్షర హోమం, దుర్గా హోమం, మహా పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం గ్రామస్తులు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, పరిసర గ్రామస్తులు యువకులు పాల్గొన్నారు.

టిడిపిలో వైసిపి నాయకుల చేరిక


టిడిపిలో చేరిన వైసిపి నాయకులు

ప్రజాశక్తి- రొంపిచర్ల: ముఖ్యమంత్రి చంద్ర బాబు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల పట్ల ఆకర్షితులై పుంగనూరు టిడిపి ఇన్‌ఛార్జి చల్లా రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో రొంపిచర్ల మండలానికి చెందిన పలువురు వైసిపి నాయకులు టిడిపిలో చేరారు. పెద్ద మల్లెల గ్రామ పంచాయతీలో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో మండలంలోని పలువురు నాయకులు, కార్యకర్తలు చల్లా బాబు సమక్షంలో టిడిపి కండువాలు వేసుకొని ఆ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా రొంపిచర్ల మండల వైసిపి నాయకులు, గ్రామ పంచాయతీ సర్పంచ్ ఆర్ ఇబ్రహీం ఖాన్, వైస్ ఎంపిపీ నూలు రెడ్డప్ప, మాజీ జడ్పిటిసి చంద్రమ్మ భాస్కర్ రెడ్డి, రొంపిచర్ల ఎంపీటీసీ రహీమాభి, బండకిందపల్లి గ్రామ సర్పంచ్ ఎస్ అన్సర్ బాష, రొంపిచర్ల వైస్ సర్పంచ్ శ్రీపతి, రొంపిచర్ల మాజీ ఎంపీటీసీ బషీర్, జాండ్ల వారి పల్లి వైస్ సర్పంచ్ బాలాజీ, రొంపిచర్ల వార్డ్ మెంబర్లు నాగరాజ, లక్ష్మయ్య టిడిపిలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చల్లా బాబు నాయకత్వంలో పార్టీ అభివృద్ధికి, సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లి మరింత అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ ఉయ్యాల రమణ, మండల టిడిపి నాయకులు రవి నాయుడు, ఓబులేశ్వర్ రెడ్డి, మదనమోహన్ రెడ్డి, మదనమోహన్ గౌడ్, అమర్నాథ్ రెడ్డి, ముద్దు కృష్ణ, శివయ్య, మునిరత్నం పాల్గొన్నారు.

రథోత్సవంపై ఆదిదంపతుల విహారం


రథంపై ఊరేగుతున్న ఆది దంపతులు

ప్రజాశక్తి -బంగారు పాళ్యం: రథోత్సవం పై ఆదిదంపతులు ఊరేగారు. ఆదివారం మండలంలోని మొగిలిలో స్వయంభు శ్రీ కామాక్షి సమేత మొగిలిశ్వర స్వామి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా 8వ రోజు రథోత్సవం పై ఆది దంపతులు భక్తులకు దర్శనమిచ్చారు. ఉభయదారులుగా బెంగళూరుకు చెందిన డెంటల్ కాలేజీ కళాశాల యాజమాన్యం రమేష్ కుటుంబ సభ్యులు వ్యవహరించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి, అమ్మవారిని దర్శించుకున్నారు. రథాన్ని లాగేందుకు భక్తులు ఉత్సాహం చూపారు. సీఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో భారీ బందో బస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ వంశపార ధర్మకర్త విజయ్ కుమార్, ఆలయ పర్యవేక్షణ అధికారి సుమన ప్రియ, ఆలయ కార్య నిర్వహణ అధికారి ముని రాజులు, అర్చకులు సోము గురుకుల్ , రెడ్డప్ప గురుకుల్, విశ్వనాధ్ గురుకుల్, హరికేష్ గురుకుల్, పవన్ గురుకుల్ ఆలయ సిబ్బంది శరవణ, లోకనాథం, మధు పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న టిడిపి నాయకులు

టిడిపి నాయకుని భార్య మృతికి నివాళి

ప్రజాశక్తి - రామకుప్పం: మండలంలోని గడ్డురు గ్రామంలో టిడిపి బూత్ కన్వీనర్ సతీష్ భార్య సుకన్య ఆదివారం మృతి చెందింది. టిడిపి నేతలు ఆమె భౌతికయానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. శనివారం పశువులు మేపుతూ రాతి గుట్ట వద్ద ప్రమాదవశాత్తు కింద పడింది. స్థానికులు గమనించి ఆమెను ఆసుపత్రికి తరలించే లోపే మృతి చెందింది. టిడిపి నేతలు ,కార్యకర్తలు వారి కుటుంబానికి 31 వేల రూపాయలు ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నేత మునస్వామి, మండల అధ్యక్షుడు ఆనంద రెడ్డి, కార్యదర్శి నరసింహులు, జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షుడు కృష్ణ నాయక్, నేతలు రామ్మూర్తి, మునిరెడ్డి, శ్రీనాథ్ రెడ్డి, పెరుమాళ్, చంద్రశేఖర్ రెడ్డి ,రఫీ, బాలరాజు ,సుబ్రి, వెంకటరమణ, సుబ్రహ్మణ్యం, మనోహర్, విశ్వనాథ్ , మురళీమోహన్, గిరి , రఘు ,ఆనంద్, సోమశేఖర్ పాల్గొన్నారు.



దగ్గుమళ్ళ రాథేయ్ పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: రాథేయ్ కన్స్ట్రక్షన్స్ అధినేత శ్రీ దగ్గుమళ్ళ రాథేయ్ బాబు పుట్టిన రోజు వేడుకలను చిత్తూరులోని చిత్తూరు ఎంపీ కార్యాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ కార్యాలయం సిబ్బంది, రాథేయ్ బాబు అభిమానులు, శ్రేయోభిలాషులు కేక్ కట్ చేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఆయన తన జీవితంలో ఇలాంటి పుట్టిన రోజు వేడుకలు మరిన్ని జరుపుకోవాలని, ఉన్నత శిఖరాలు అధిరోహించాలనీ వారు కాంక్షించారు.

తాగునీటి పైపులు ధ్వంసం

- విద్యార్థులకు తాగునీటి సమస్య
- మందు బాబులకు అడ్డాగా పాఠశాల
- పాఠశాల ఆవరణలో అపరిశుభ్రత
- ఫిర్యాదు చేసినా స్పందించని అధికారులు

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తాగునీటి పైపులైనును గుర్తు తెలియని వ్యక్తులు సెలవు సమయంలో ధ్వంసం చేశారు. దీంతో విద్యార్థులు తాగునీరు లేక నానా అవస్థలు పడుతున్నారు. సెలవు రోజుల్లో ఈ పాఠశాల మందు బాబులకు అడ్డాగా మారి పాఠశాల పరిసరాలు మందు బాటిళ్లతో, వారు తినే పదార్థాల వ్యర్థాలతో నిండి అపరిశుభ్రంగా మారుతోంది. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనిపై పోలీసులు, విద్యాధి కారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మందుబాబులకు అడ్డాగా మారింది. సెలవు రోజుల్లో మద్యం మత్తులో తాగునీటి పైపులు గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. ఈ కారణంగా విద్యార్థులకు తాగునీటి సరఫరా ఆగిపోయింది. ప్రస్తుతం విద్యార్థులకు మధ్యాహ్న భోజనానికి సైతం తాగేందుకు నీరు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొం టున్నారు. సెలవు రోజు వస్తే చాలు.. పాఠశాల ఆవరణలో స్థానికులు కొందరు పెద్ద గుంతలు వేస్తున్నారు. ఏదో సరదాగా కాసేపు ఆడుకొని వెళ్లిపోతారని పాఠశాల సిబ్బంది వ్యవహరిస్తున్నారు. ఈ ప్రభావం వల్ల ఆకతాయిలు చేష్టలు అధికమై పైపు లైను ధ్వంసమైంది. విద్యార్థులకు తాగునీటి తీవ్ర సమస్య ఎదురైంది. పాఠశాలలో తాగునీటి సరఫరా పైపులను మద్యం మత్తులో ఏం చేస్తున్నామో తెలియకుండా మందు బాబులు తాగునీటి పైపులు ధ్వంసం చేస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. స్థానిక సెక్యూరిటీ ఏమ య్యాడు? పాఠశాల ఆవరణలో ఇలా ఎందుకు జరుగు తోందో? ఆలోచించే నాథుడే కరువయ్యారు. దీని ప్రభావం వల్ల పిల్లలకు మధ్యాహ్న భోజనానికి తాగునీటి సమస్య అధికమైంది.


తాగునీటి పైపును ధ్వంసం చేసిన ఆకతాయిలు

ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు..

ఈ విషయమై మూడు రోజులకు ముందే స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాం.. పాఠశాల సెలవు దినాల్లో ఇలాంటి ఘటనలు తరచూ చోటుచేసుకుంటున్నాయి. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి పాఠశాల సెలవు రోజుల్లో పాఠశాల ఆవరణలోకి ఎవరూ ప్రవేశించకుండా కట్టడి చేయాలని పాఠశాల ప్రధానోపాధ్యాయు రాలు కోరారు. ప్రభుత్వ ఆస్తిని ధ్వంసం చేయకుండా చూడా లని పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



మాట్లాడుతున్న డిఎస్‌పి ప్రభాకర్

స్ఫూర్తి దాయకం: డిఎస్‌పి

ప్రజాశక్తి- పలమనేరు: ఉచిత మెగా వైద్య శిబిరం స్ఫూర్తి దాయకమని డిఎస్‌పి ప్రభాకర్ పేర్కొన్నారు. పలమనేరు పట్టణంలో బిగ్ టీవీ ఆధ్వర్యంలో సాయిరాం మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి సహకారంతో మెగా హెల్త్ క్యాంప్ ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గుండె జబ్బులు, బిపి, షుగర్, థైరాయిడ్, ఇసిజి, ఈకో ,చెవి, ముక్కు, గొంతు, జ్వరం, గర్భిణులకు స్కానింగ్ , సంతానం లేమి వారికి ప్రత్యేక పరీక్షలు నిర్వహించారు. సుమారు 200 మంది హాజర య్యారు. రోగులకు, వివిధ జబ్బులకు వైద్య పరీక్షల నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన పలమనేరు డిఎస్‌పి డేగల ప్రభాకర్ మాట్లాడుతూ బిగ్ టీవీ, సాయిరాం ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమం ఎంతో స్ఫూర్తిదాయకం అన్నారు. డాక్టర్లు మాట్లాడుతూ ఎంతో మంది గుండె జబ్బును ముందే గుర్తించక ప్రాణాలు విడిచిన సందర్భాలు వున్నాయని, ఇలాంటి ఉచిత కార్యక్రమాలు సద్వినియోగం చేసుకుని ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. ఈ మెగా వైద్య శిబిరంలో గుండెకు సంబంధించిన వైద్య నిపుణులు డాక్టర్ రెడ్డి బాష, చెవి ముక్కు, గొంతు థైరాయిడ్ వైద్య నిపుణులు, డాక్టర్ యుగంధర్ , జనరల్ వైద్య నిపుణులు డాక్టర్ తరంగిణి పాల్గొన్నారు.


రోగులను పరీక్షిస్తున్న వైద్యుడు

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - రామకుప్పం: మండలంలోని సింగ సముద్రం, బల్ల గ్రామా ల్లో బిఆర్‌డి, ప్రియ నర్సింగ్ హోమ్ ఆధ్వర్యం లో ఉచిత వైద్య శిబిరా లు నిర్వహిం చారు. ఆదివారం రెండు గ్రామాల్లో నిర్వహించిన వైద్య శిబిరాల్లో సుమారు 550 మంది రోగులకు బిపి, షుగర్, గుండె జబ్బులు, గర్భకోశ వ్యాధులు, సాధారణ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అధిక వ్యాధిగ్రస్తులను కుప్పం ఆసుపత్రికి సిఫార్సు చేశారు. ఎన్టీఆర్ వైద్య సేవలు ద్వారా ఆపరేషన్లు ఉచితంగా నిర్వహిస్తామని రోగులకు వివరించారు. ఈ అవకాశాన్ని రోగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అంతకుముందు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు సురేష్ బాబు ,సుధీర్, రాష్ట్ర టిడిపి నేతలు మునస్వామి, నారాయణ చారి, మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి, నరసింహులు, ఆంజనేయ రెడ్డి, రామ్మూర్తి, రఫీ, శ్రీనివాసులురెడ్డి,మనోహర్, జయశంకర్ ,విశ్వనాథ్, నాగభూషణం పాల్గొన్నారు.



ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్

22 మంది కంటి చికిత్సకు ఎంపిక

ప్రజాశక్తి -బంగారు పాళ్యం: 22 మంది కంటి చికిత్సకు ఎంపికైనట్టు మాజీ ఎమ్మెల్యే వెంకటేశ్వర చౌదరి తెలి పారు. ఆదివా రం మండల కేంద్రంలోని మాజీ ఎంపీ చెంగల్రాయ్ నాయుడు ట్రస్ట్ ద్వారా తిరుపతికి చెందిన అరవింద్ కంటి ఆసుపత్రి సిబ్బంది కంటి పరీక్షలు చేపట్టారు. 105 మంది కంటి పరీక్షలు చేసుకోగా 22 మంది సమస్యలను గుర్తించి వారికి తిరుపతి అరవింద్ కంటి ఆసుపత్రిలో ఉచితంగా ఆపరేషన్లు చేసి తగిన మందులు ఇవ్వనున్నట్లు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మురళీకృష్ణ ధరణి నాయుడు, భాను ప్రకాష్, కమలనాధ రెడ్డి, రవీంద్ర నాయుడు, అరవింద కంటి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కాలువ ఎక్కడ?

మురికి నీరు పరిష్కారం ఏది?


మురుగు కాలువలు లేక అస్తవ్యస్తంగా పారుతున్న మురుగు నీరు

ప్రజాశక్తి- నింద్ర: మండలంలో ప్రతి చోటా మురికి నీరు పోకుండా వీధి కాలువలలోనే నిలిచిపోతున్నాయి. పంచాయతీ లో ఇరువైపులా కాలువలు కట్టమని చెప్పడానికి ఎవరికీ ధైర్యం చాలడం లేదు. ఎందు కంటే ఇరువైపుల వారు కాలువ స్థలాన్ని ఆక్రమించుకొని ప్రహరి గోడలు కట్టుకున్నారు. కాలువను నిర్మించాలని కోరితే గోడలను కూల్చాల్సి వస్తుందని వారికి వారే మౌనంగా వ్యవహరిస్తున్నారు. సీసీ రోడ్డు ఇరువైపులా రెండు అడుగులు కూడా లేదు. స్థానికులు ఎవరైనా ముందుకొచ్చి కాలువ పరిస్థితి ఏమిటి? అని అడిగితే వారిపై గొడవకు వస్తున్నారు. ప్రభుత్వం స్వచ్ఛభారత్, స్వచ్ఛ ఆంధ్ర, పరిశుభ్రమైన గ్రామం అంటున్నారు.. కానీ ఆదర్శంలో లేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా గ్రామ పంచాయతీ చర్యలు తీసుకొని ఇరువైలా మురికి కాలువలు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

నిరుద్యోగులకు సువర్ణ అవకాశం: పీడీ


మాట్లాడుతున్న కడా పీడీ వికాస్ మర్మత్

ప్రజాశక్తి- కుప్పం టౌన్ : కుప్పం నియోజకవర్గ పరిధిలోని నిరుద్యోగులు ప్రభుత్వ అవకాశా లను సద్వినియోగం చేసుకోవాలని కడా పీడీ వికాస్ మర్మత్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కుప్పం నియోజకవర్గ పరిధిలో పదవ తరగతి, ఆపై చదువు పూర్తి చేసి ఖాళీగా ఉన్న నిరుద్యో గులకు ముఖ్యమంత్రి చంద్రబాబు సహకారంతో 1ఎం 1బి గ్రీన్ స్కిల్స్ రెడీనెస్ సెంటర్ ద్వారా ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. వివిధ నగరాలలోని ప్రముఖ సంస్థల లో అనేక రకాల ఉద్యోగ అవకాశాలకు నిరుద్యోగులను సన్నద్ధం చేసి, ఉద్యోగాలు ఇప్పించడానికి 1ఎం 1బి గ్రీన్ స్కిల్స్ రెడీనెస్ సెంటర్ ద్రావిడ విశ్వవిద్యాలయంలో ఈనెల 3, 4 వ తేదీలలో ప్రి ప్లేస్‌మెంట్ శిక్షణ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ శిక్షణ పొందిన వారికి మార్చి 11 వ తేదీన జాబ్ మేళా నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం చేపడుతున్న శిక్షణలో ఇంటర్వ్యూకి ఎలా తయారు కావాలి? ఇంటర్వ్యూ ను ఎలా ఎదుర్కోవాలి? ఉద్యోగం సాధించడానికి అవసర మైన శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని, శిక్షణకు నిరుద్యోగులు ముందు తమ పేర్లను ద్రావిడ విశ్వా విద్యాలయంలో నమోదు చేసుకోవాలని సూచించారు.

జల్లికట్టులో అపశృతి

పలువురికి గాయాలు

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి : మండలంలోని కమ్మనపల్లి పంచాయతీ పరిధిలోని జాలరపల్లిలో ఆదివారం నిర్వహించిన ఎద్దులు పరుగు పందెం(జల్లికట్టు)లో అపశృతి చోటుచేసుకుంది. ఈ సందర్భంగా పలువురు ఎద్దులను నిలువరించేందుకు ప్రయత్నించి పలువురు గాయపడ్డారు. మండలంలోని కమ్మనపల్లి పంచాయతీ పరిధిలోని జాలరపల్లిలో జల్లికట్టు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మొదటి బహుమతి 50 వేల ఒక రూపాయి ప్రకటించారు. ద్వితీయ బహుమతి 40 వేలు ప్రకటించడంతో యువకులు కేరింతలతో ఎద్దులను అడ్డుకునేందుకు పోటీ పడ్డారు. జన సమూహంలో ఎద్దుల పరుగులతో ప్రాణాలు సైతం లెక్కచేయకుండా యువకులు కేరింతలతో ఎద్దులపై చేతులు వేస్తూ పట్టుకునేందుకు యత్నించారు. ఈ సందర్భంగా బైరెడ్డిపల్లి మండలానికి చెందిన రమేష్, కర్ణాటకకు చెందిన సుధాకర్, తమిళనాడుకు చెందిన మురుగేష్ ఎద్దుల పరుగు పందెంలో భాగంగా స్వల్ప గాయాలతో బయటపడ్డారు. గాయాల పాలైన వారిని చికిత్స నిమిత్తం108 సాయంతో బైరెడ్డిపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆదివారం ఉదయం నుంచి నాలుగు గంటల వరకు నిర్వహించిన ఎద్దుల పండుగలో మొట్టమొదట చింతమాకులపల్లి పాతూరు నాథం గ్రామాలకు చెందిన ఎద్దులు పౌరుషంతో పరిగెత్తడంతో మొదటి ప్రైజ్ 50 వేలు, ద్వితీయ బహుమతి 40 వేలు రెండు ఎద్దుల యజమానులకు కలిపి గ్రామస్తులు అందించారు. అనంతరం పరుగు పందెంలో గెలుపొందిన 36 ఎద్దులకు ప్రకటించిన బహుమతులు గ్రామస్తులు అందించారు.


ఎద్దులను అడ్డుకుంటున్న యువకులు


ఎద్దులను అడ్డుకుని గాయపడ్డ యువకుడు

'పురపాలక సంఘం అధ్యక్షుడిగా అవకాశం ఇవ్వాలి'

ప్రజాశక్తి- కుప్పం టౌన్ : కుప్పం పురపాలక సంఘం అధ్యక్షుడిగా వాల్మీకి కులస్తులకు అవకాశం కల్పించాలని ఆ సామాజికి వర్గ సభ్యులు కోరారు. ఆదివారం పట్టణంలోని శ్రీ రాజావారి భవన ప్రాంగణంలో వాల్మీకి కుల సభ్యులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుప్పం చరిత్రలో వాల్మీకి కులస్తులకు ప్రత్యేక స్థానం ఉందని, ఆనాడు కుప్పంలో పాలించిన జమీందారు వాల్మీకి కులస్తుడేనని తెలిపారు. కుప్పం పాలకుడిగా ఈ ప్రాంత అభివృద్ధికి, తాలూకాలోని ఆలయాల నిర్వహణకు భూములను ఇనాముగా ఇచ్చిన ఘనత వాల్మీకి కులస్తులకు ఉందన్నారు. అలాంటి వాల్మీకులకు కుప్పం పట్టణ పరిధిలో సముచిత స్థానం దక్కలేదని తెలిపారు. 2024 సార్వత్రిక ఎన్నికల అనంతరం కుప్పం పట్టణంలో చోటు చేసుకున్న రాజకీయ పరిణామాల కారణంగా పురపాలక సంఘం అధ్యక్ష పదవి ఖాళీ అయిందని, ఈ పదవిని వాల్మీకి కులస్తులకు కేటాయించాలని కోరారు. ముఖ్యంగా ఇప్పటికే పురపాలక సంఘం ఫ్లోర్ లీడర్ గా కొనసాగుతున్న దామోదర్ నాయుడును పురపాలక సంఘం అధ్యక్ష పదవికి ఎంపిక చెయ్యాలని కోరారు. అనంతరం వారు పురపాలక సంఘం ఫ్లోర్ లీడర్ కు అధ్యక్ష పదవి ఇవ్వాలని కోరుతూ వినతి పత్రాన్ని తయారుచేసి ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ కు అందించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గానికి చెందిన నాలుగు మండలాలలోని వాల్మీకి కుల సభ్యులు పాల్గొన్నారు.


వాల్మీకి సంఘ సమావేశంలో పాల్గొన్న నాయకులు

అభ్యున్నతే కూటమి లక్ష్యం: ఎమ్మెల్సీ

ప్రజాశక్తి-కుప్పం టౌన్ : ఎన్నికల్లో కూటమి నాయకులు ఇచ్చిన హామీలు నెరవేరుస్తామని ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ తెలిపారు. ఆదివారం కుప్పం పట్టణంలోని టిడిపి కార్యాలయ ఆవరణలో టిటిడి పాలక మండలి సభ్యులు, టిడిపి నాయీ బ్రాహ్మణ సాధికార కమిటీ రాష్ట్ర అధ్యక్షులు శాంతారామ్, ఏపీఎస్ఆర్టీసీ ఉపాధ్యక్షులు పిఎస్ మునిరత్నం ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం నిర్వహించిన పాత్రికేయ సమావేశంలో పలువురు టిడిపి నాయకులు మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలలో భాగంగా కూటమి ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చడానికి సిద్ధంగా ఉన్నారు. ఇప్పటికే సూపర్ సిక్స్ లోని పలు హామీలు నెరవేరుస్తున్నామన్నారు. మరికొన్ని హామీలను త్వరలో నెరవేరుస్తామన్నారు. ప్రభుత్వం, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా పనిచేస్తోందన్నారు. టిటిడి పాలక మండలి సభ్యులు మాట్లాడుతూ ఎన్నికల సమ యంలో నాయీ బ్రాహ్మణ అభివృద్ధి కి ప్రభు త్వం 12 పథకా లను అమ లు చేస్తామని హామీ ఇచ్చినట్టు తెలిపారు. వీటిలో ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా దేవాలయాలలో పనిచేస్తున్న నాయి బ్రాహ్మణ కులస్తుల జీతభత్యాలను 25 వేలకు పెంపు, 1200 దేవాలయాల కమిటీ సభ్యులుగా నాయీ బ్రాహ్మణులకు అవకాశం వంటి హామీలను నెరవేర్చామని తెలిపారు. నాయీ బ్రాహ్మణుల అభ్యున్నతిని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ లో ప్రత్యేకంగా నాయి బ్రాహ్మణ దుకాణాల ఉచిత విద్యుత్ కు 400 కోట్లు కేటాయింపు హర్షణీయ మన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపీ డాక్టర్ వెంకటేష్, టిడిపి మహిళా నాయకురాలు భాగ్యలక్ష్మి త్రిలోక్, నాయి బ్రాహ్మణ కులస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


చిత్ర పటాలకు సన్మానం చేస్తున్న టిడిపి నాయకులు

రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి

ప్రముఖ పారిశ్రామికవేత్త పైమాగం సుగుణాకర్ రెడ్డి

ప్రజాశక్తి- తవణంపల్లి: కుల, మతాలకు అతీతంగా, రాజకీయాలకు అతీతంగా జన్మభూమిని అభివృద్ధి చేయనున్నట్లు ప్రముఖ పారిశ్రామిక వేత్త, అర్ధగిరి వీరాంజనేయ స్వామి ఆలయ మాజీ ఛైర్మన్ పైమాగం సుగుణాకర్ రెడ్డి అన్నారు. పూతలపట్టు నియోజకవర్గంలో తన సొంత నిధులతో 20 జలశుద్ధి కేంద్రాలను ఏర్పాటు చేసి 17 జలశుద్ధి కేంద్రాలను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అరగొండ మేజర్ పంచాయతీ బీసీ కాలనీలో ఏర్పాటు చేసిన జలశుద్ధి కేంద్రాన్ని మాజీ సర్పంచ్ కరీంతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ, తదితర రాష్ట్రాలతో పాటు ఇతర దేశాల్లోనూ ప్రముఖ కంపెనీలతో వ్యాపార లావాదేవీలు నిర్వహిస్తున్నామన్నారు. జన్మభూమి స్ఫూర్తితో పుట్టిన గ్రామానికి ఏదో చేయాలనే ఉద్దేశంతో 30 సంవత్సరాలుగా సొంత నిధులు వెచ్చించి వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. ఇందులో భాగంగానే మొదట అరగొండలో అపోలో ఆస్పత్రి నిర్మాణానికి తమ వంతు సహాయ సహకారాలు అందించి ఏర్పాటు చేయడానికి చేయూతనిచ్చినట్లు పేర్కొన్నారు. అనంతరం సర్వ మత సామరస్యాన్ని ప్రోత్సహించేందుకు ఎస్సీ, ఎస్టి, బిసి మైనార్టీలకు పై మాగంలో శ్రీరామ ఆలయ కళ్యాణ మండపం ఏర్పాటు చేశామన్నారు. ఇందులో అన్ని వర్గాల ప్రజలను భాగస్వాములు చేసి సామూహిక వివాహాలు చేపట్టామన్నారు. మసీదు నిర్మాణానికి సహకారం అందించామని తెలిపారు. నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో ప్రజలకు శుద్ధమైన జలాలను అందించే లక్ష్యంగా 20 జలశుద్ధి కేంద్రాల ఏర్పాటుకు తలపెట్టి 17 పూర్తి చేసి ప్రారంభించామని పేర్కొన్నారు మూడు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయని వాటిని త్వరలో పూర్తి చేస్తామని పైమాగం సుగుణాకర్ రెడ్డి పేర్కొన్నారు. మాజీ సర్పంచ్ కరీం మాట్లాడుతూ జన్మభూమి అభివృద్ధికి తన వ్యాపారాలు పక్కన పెట్టి అరగొండకు పైమాగం సుగుణాకర్ రెడ్డి సేవ చేయడం హర్షణీయమన్నారు. ఆయన స్ఫూర్తితో పలువురు దాతలు ముందుకు వస్తున్నారని ఆయన్ని స్ఫూర్తిగా తీసుకొని జిల్లాలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు కరీం తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మల్లు దొరై, ప్రశాంత్ కుమార్, అరగొండ పంచాయతీ సెక్రెటరీ మురుగేషన్, టిడిపి నాయకులు లోకేష్, చేరాల చలపతి, నాగరాజు, మారు కొండయ్య, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


తాగునీటిని అందిస్తున్న పైమాగం సుగుణాకర్‌రెడ్డి

క్రైం న్యూస్

నిప్పల కట్టెలతో దాడి

మహిళ ఆస్పత్రి పాలు

ప్రజాశక్తి -గంగవరం : నిప్పుల కట్టెలతో మహిళపై దాడి చేయడంతో తీవ్ర గాయాలతో ఆస్పత్రి పాలైన సంఘటన ఆదివారం మండలంలో చోటుసుకుంది. పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలో దీప మహిళ కిరాణా కొట్టు నడుపుతూ ఉంది. పక్కనే రాము హోటల్ నడుపుతున్నాడు. హోటల్‌లో కడిగిన వృథా నీరు శుభ్రం చేసిన నీరు దీప దుకాణం ముందుకు రావడంతో అనేకసార్లు రామును హెచ్చరించింది. అయినా ప్రయోజనం లేకుండా పోయిందని బాధితురాలు వాపోయింది. ఈ విషయమై స్థానిక పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేశానని శనివారం రాత్రి యథా ప్రకారం వృథా నీరు దుకాణం ముందు రోడ్డుపైకి రాగా తమ అంగిడి ముందు వృథా నీరు పోవడంతో దుర్వాసనతో పాటు తమ దుకాణానికి ఎవరూ రాలేదని పరిసరాలని శుభ్రంగా ఉంచుకోవాలని ప్రాధేయపడినా వినకపోవడమే కాకుండా హోటల్ పొయ్యిలో కాలుతున్న కట్టలతో తనపై దాడి చేయడంతో తీవ్ర గాయాలు పాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు మహిళ తెలిపారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేశామని తమకు న్యాయం చేయాలని మహిళ కోరుతున్నారు.


మృతదేహంపై పడి విలపిస్తున్న కుటుంబీకులు

విద్యుత్ షాక్‌తో విద్యార్థి మృతి

ప్రజాశక్తి-గంగాధరనెల్లూరు: విద్యుత్ షాక్‌తో విద్యార్థి మృతి చెందిన సంఘటన మండలంలో ఆదివారం చోటు చేసుకుంది. మండలంలోని కట్టకిందపల్లి దళిత వాడలో మాధవి, దినకరన్‌ల కుమారుడు సీమోను అలియాస్ సూరి (13) ఆదివారం ఉదయం 10 గంటలకు చర్చి ప్రార్థనలు ప్రారంభమయ్యేలోపు మైక్‌ను సిద్ధం చేస్తుండగా విద్యుత్ షాక్ గురయ్యాడు. వెంటనే అంబులెన్స్‌లో స్థానిక దళితవాడకు చెందిన ప్రజలు ఆ విద్యార్థిని చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి డాక్టర్లు అతని పరీక్షించి అప్పటికే మృతి చెందాడని ధృవీకరించారు. సూరి మృతి వార్త విని కుటుంబ సభ్యులు, బంధువులు తీవ్రంగా విలపించారు. కాగా ఈ విద్యార్థి ఎట్టేరి శ్రీ భానోదయ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్లో 8వ తరగతి చదువుతున్నాడు.


ప్రమాదానికి కారణమైన జెసిపి

కారును ఢీకొన్న జెసిబి

మహిళకు తీవ్రగాయం

ప్రజాశక్తి -సోమల: కారును జెసిబి ఢీకొన్న ప్రమాదంలో మహిళ తీవ్రంగా గాయపడిన సంఘటన మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. అన్నమయ్య జిల్లా ఊలపాడు పంచాయతీ నరసాపురం గ్రామానికి చెందిన చెర్లోపల్లి నాగరాజు కుటుంబ సభ్యులతో కలిసి సోమల వీరుగా తిరుమలకు కారులో ఆదివారం ఉదయం 5 గంటల సమయంలో బయలుదేరారు. ఆరు గంటల 45 నిమిషాల ప్రాంతంలో సోమల టెలిఫోన్ ఎక్స్చేంజ్ సమీపానికి కారు రాగానే ఎడమవైపు నుండి జెసిబి నిర్లక్ష్యంగా రోడ్డుపైకి రావడంతో కారుకు ఎడమవైపు భాగంలో ఢీకొంది. దీంతో కారులో ఉన్న నాగరాజు భార్య భాగ్యమ్మ తలకు తీవ్ర గాయం కావడంతో సోమల ప్రభుత్వ వైద్యశాలకు, అనంతరం సదుం వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు. దీనిపై నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివశంకర్ తెలిపారు.


లారీ పై నుండి పడి మృతి చెందిన మంజునాథ్

లారీ పై నుండి పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి -పలమనేరు: లారీ పై నుండి పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. పలమనేరు పట్టణ ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది కథనం మేరకు..గుడియాత్తం రోడ్డు కాల్వపల్లి చెక్‌పోస్టు వద్ద లారీ పైనుండి కిందపడి కర్ణాటకకు చెందిన మంజునాథ్ మృతి చెందాడని ఆసుపత్రికి తీసుకువచ్చారు. ఈ ఘటనపై పోలీసులకు సమాచారం అందించారు. మంజునాథ్ లారీపై నుండి పడి మృతి చెందాడా? లేదా మరింకేదైనా కోణం వుందా? అనేది పోలీసుల దర్యాప్తులో తెలియాల్సి వుంది.